
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 26.8 కనిష్ఠం 16.2



కామారెడ్డి జిల్లా వార్తలు

3

గురువారం 11 జనవరి 2024

సేవాలాల్ జయంతి రోజు సెలవుదినంగా ప్రకటించాలి

ఎల్లారెడ్డి, జనవరి 10: గోర్‌బంజారా(లంబాడి)ల ఆరాధ్యదైవం సేవాలాల్ మహరాజ్ జయంతి రోజు సెలవుదినంగా ప్రకటించాలని గోర్‌సేన యూత్ ప్రెసిడెంట్ బంజారా ప్రేమ్ బుధవారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు వినతి పత్రం అందించారు. చాలా కాలంగా సేవాలాల్ జయంతిని సాధారణ సెలవుదినంగా ప్రక టించాలని కోరినా ఎవరు పట్టించుకోలేదని ప్రస్తుతం ఏర్పడిన నూతన ప్రభుత్వమైన తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తప్పకుండా ఈ విషయాన్ని ప్రభుత్వానికి విన్నవిస్తానని, అసెంబ్లీలో ప్రస్తావిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, చవాన్, సంతోష్, బాబు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



భూ సమస్యలకు

పరిష్కారం దొరికేనా?

- ధరణి ప్రక్షాళనకు ప్రభుత్వం కసరత్తు
- పరిష్కారం కోసం సర్కారు ప్రత్యేక చర్యలు
- రికార్డులు చూసిన తర్వాతే ముందడుగు
- తప్పనిసరి కానున్న క్షేత్రస్థాయి నివేదిక
- ఏళ్లుగా అన్నదాతలకు తప్పని నిరీక్షణ
- జిల్లాలో సుమారు 7 వేలకు పైగా పెండింగ్‌లో భూ సమస్యల దరఖాస్తులు
- మరో 8వేల మంది రైతులకు పైగా అందని పట్టా పాసు పుస్తకాలు

కామారెడ్డి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ధరణిని తొలగించి ఏళ్ల తరబడి భూ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఊరట కల్పించేందుకు ధరణిని తొలగిస్తామని ఆ వెబ్‌సైట్‌ను ప్రక్షాళన చేస్తామంటూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి రావడం ధరణిపై దృష్టి సారించింది. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు భూ లావాదేవీలను పారదర్శకంగా నిర్వహించేందుకు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగానే ధరణి పోర్టల్ స్థానంలో మరొకటి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. భూ పరిపాలన కమిషనర్‌కు నివేదించే నిమిత్తం రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పెండింగ్ సమస్యలపై ఇప్పటికే ప్రత్యేకంగా నివేదికను రూపొందించింది. ఇప్పటి వరకు భూ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో సుమారు 7 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని మరో 8 వేలకు పైగా రైతులకు పట్టా పాసు పుస్తకాలు అందక పలు పథకాలకు దూరమవుతున్నట్లు గుర్తించారు. ఈ నివేదికను ప్రభుత్వానికి జిల్లా యంత్రాంగం సమర్పించనుంది.

జిల్లాలో 8.63లక్షల ఎకరాల్లో వ్యవసాయ భూ విస్తీర్ణం

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో సాగు భూములకు సంబంధించి 8,63,973 ఎకరాల భూ విస్తీర్ణంలో వివిధ పంటలు సాగవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,77,898 ఖాతాలు ఉన్నాయి. వ్యవసాయఖాతాలతో పట్టాపాసు పుస్తకాలు ఇప్పటి వరకు పంపిణీ చేసినవి 2,58,298 ఉండగా వీటి పరిధిలో 5,14,576 ఎకరాలలో భూ విస్తీర్ణం ఉంది. అయితే గత 10ఏళ్ల కిందట గత ప్రభుత్వంలో భూ దస్త్రాల ప్రక్షాళన సమయంలో రైతులకు చెందిన సర్వే నెంబర్లతో పాటు ఇతరత్రా రైతులకు చెందిన సాగు భూముల సర్వే నెంబర్‌లో నిషేధిత జాబితాలో పడ్డాయి. బాధిత రైతులు ప్రతిరోజూ జిల్లా కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. అయితే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ సర్కార్ ధరణిని ప్రక్షాళన చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో బాధిత రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికైనా తమ భూ సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తున్నారు.

వీడని ధరణి చిక్కు ముడులు

జిల్లాలోని చాలా మంది రైతులకు కొత్త పట్టా పాసుపుస్తకాలు అందలేదు. పట్టా భూమి టైటిల్ ఉన్న వారు ఇతర ప్రాంతాల్లో ఉండడం, మ్యూటేషన్‌లు కాకపోవడం, ఇతర భూ సమస్యలతో జిల్లాలో వేలాది మంది రైతులకు కొత్త పట్టా పాసుపుస్తకాలు రావడం లేదు. ప్రస్తుతం ధరణి వెబ్‌సైట్ కేవలం రిజిస్ట్రేషన్‌లకే పరిమితమవుతోంది. పాత భూ సమస్యలు, మ్యూటేషన్‌లు, విరాసత్, నాలా కన్వర్షన్, పెండింగ్ పరిష్కారాలు తదితర అన్ని సేవలను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్‌లకు బాధ్యతలు అప్పగించారు. భూ సమస్యలపై ఏవైనా ఫిర్యాదులు వస్తే వాటిని సరి చేసేందుకు కలెక్టర్‌లకే లాగిన్ ఉంది. అయితే కలెక్టర్‌లు వివిధ పనులలో పాలన పరంగా బిజీ కావడంతో ధరణిలోని భూ సమస్యలను పరిష్కారం చేయలేక పెండింగ్‌లోనే ఉండిపోతున్నాయి. దీంతో భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు ఉన్నతధికారులతో పాటు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ నిత్యం ప్రదక్షణలు చేస్తున్నారు.

15 వేలకు పైగా భూ సమస్యల దరఖాస్తులు

గత ప్రభుత్వం ధరణిని అందుబాటులోకి తీసుకువచ్చినప్పటికీ చాలా మంది రైతులకు సంబంధించిన వేలాది ఎకరాల భూములు నిషేధిత జాబితాలోనే కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఆర్ఎస్ఆర్ సమస్యలతో సుమారు 7 వేలకు పైగానే దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి పరిష్కారానికి 6 వేల మందికి పైగా రైతులు పట్టా పాసు పుస్తకాలు అందని పరిస్థితి నెలకొంది. కామారెడ్డి పరిధిలో 4,213, ఎల్లారెడ్డిలో 2,650, బాన్సువాడలో 1,232 దరఖాస్తులు ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ఉంటున్నాయి. వీరికి పట్టాపుస్తకాలు అందకపోవడమే కాకుండా పట్టా భూములైనప్పటికీ ప్రభుత్వ భూములుగా నమోదై ఉన్నాయి. అదేవిధంగా ఒక గ్రామంలో ఏదైన సర్వే నెంబర్‌లోని ఓ రైతుకు చెందిన భూమికి సంబంధించి న్యాయ వివాదం ఉంటే ఆ సర్వే నెంబర్‌ను పూర్తిగా నిషేధిత జాబితాలో చేర్చారు. ప్రస్తుతం నూతనంగా ప్రవేశపెట్టిన ఆప్షన్‌లలో అటువంటి భూ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంది. అదేవిధంగా భూ దస్త్రాల ప్రక్షాళన సమయంలో అందుబాటులో లేని రైతులకు చెందిన సర్వే నెంబర్‌తో పాటు ఇతరత్రా రైతులకు చెందిన సాగు భూముల సర్వే నెంబర్‌లను నిషేధిత జాబితాలో నమోదు చేశారు. ఇలా కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ పరిధిలో మొత్తం 8,430 సర్వే నెంబర్‌లు నిషేధిత జాబితాలో చేర్చడంతో సుమారు 4,225 మంది బాధిత రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలా ధరణితో 10 ఏళ్లుగా భూ సమస్యల పరిష్కారం కాకుండా ఏళ్ల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

ఇకపై పక్కాగా..

భూములకు సంబంధించిన రికార్డులన్నీ తహసీల్దార్ కార్యాలయంలోనే ఉన్నాయి. పహాణీలు మొదలు, పట్టాదారు పాస్ పుస్తకాల నకల్, భూమి శిస్తు చెల్లించిన రశీదులు ఇలా ప్రతీ రికార్డు అక్కడ ఉంటుంది. ఏదైన భూమికి సంబంధించి వివాదం తలెత్తినప్పుడు ఈ రికార్డులనే ప్రమాణికంగా తీసుకుని వాటిని పరిష్కరిస్తుంటారు. ఇందులో పొందుపరిచిన వివరాలను ఆధారం చేసుకొనే తహసీల్దార్‌లు రిపోర్టులు తయారు చేస్తుంటారు. క్షేత్రస్థాయి అధికారులు ఇచ్చే ఈ రిపోర్టులే ధరణి దరఖాస్తుల పరిష్కారంలో కీలకం. పాత రికార్డులో ఉన్న వివరాలకు భిన్నంగా కొన్ని రిపోర్టులు ఉంటున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. భూమి పూర్వాపరాలు పరిశీలించకుండా కలెక్టర్‌లు కూడా వారు ఇచ్చే రిపోర్టులపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఒక్కోసారి కలెక్టర్‌లు కూడా వీటిని గుడ్డీగా ఆమోదించి ఆ తర్వాత న్యాయపరమైన చిక్కులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఆన్‌లైన్ రిపోర్టులతో పాటు ఆఫ్‌లైన్ రికార్డులను పరిశీలించడం ద్వారా వీటికి చెక్ పెట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు.

ఫైనల్‌కు కర్ణాటక, హర్యానా జట్లు

- ఉత్కంఠ భరితంగా సాగిన సెమీ ఫైనల్స్
- సెమీ ఫైనల్స్ మొదటి సెషన్స్‌లో తలపడిన కర్ణాటక వర్సెస్ ఢిల్లీ జట్లు
- విజయం సాధించి ఫైనల్‌కు చేరిన కర్ణాటక
- రెండో సెషన్‌లో తలపడిన తెలంగాణ వర్సెస్ హర్యానా
- విజయం సాధించి ఫైనల్స్‌కు చేరిన హర్యానా
- నేడు ఫైనల్స్‌లో తలపడనున్న కర్ణాటక వర్సెస్ హర్యానా జట్లు



సెమీ ఫైనల్స్‌లో తలపడుతున్న తెలంగాణ వర్సెస్ హర్యానా జట్లు

కామారెడ్డి టౌన్, జనవరి 10: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో కొనసాగుతున్న 67వ ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలు నేటితో ముగియనున్నాయి. బుధవారం ఉదయం ప్రీక్వాటర్ ఫైనల్‌లో 4 మ్యాచ్‌లు కొనసాగాయి. హర్యానా వర్సెస్ మహారాష్ట్ర జట్లు పోటీ పడగా హర్యానా జట్టు విజయం సాధించింది. విద్యాభారతీ వర్సెస్ కర్ణాటక జట్లు పోటీ పడగా కర్ణాటక జట్టు విజయం సాధించింది. ఉత్తరప్రదేశ్ వర్సెస్ ఢిల్లీ జట్లు పోటీ పడగా ఢిల్లీ జట్టు విజయం సాధించింది. తెలంగాణ వర్సెస్ హిమాచల్ ప్రదేశ్ జట్లు పోటీపడగా తెలంగాణ జట్టు విజయం సాధించింది. సాయంత్రం సెమీ ఫైనల్‌లో 2 మ్యాచ్‌లు జరిగాయి. సెమీ ఫైనల్ మొదటి సెషన్స్‌లో కర్ణాటక వర్సెస్ ఢిల్లీ జట్లు పోటీపడగా కర్ణాటక జట్టు 7 పాయింట్ల ఆధిక్యంతో విజయం సాధించింది. రెండో సెషన్స్‌లో తెలంగాణ వర్సెస్ హర్యానా జట్లు పోటీ పడగా హర్యానా జట్టు 29 పాయింట్ల ఆధిక్యంతో విజయం సాధించింది. కాగా మంగళవారం రాత్రి జరిగిన తెలంగాణ వర్సెస్ చత్తీస్‌ఘడ్ మ్యాచ్‌లో చత్తీస్‌ఘడ్ విజయం సాధించింది. అయితే ఇందులో ఒక ప్లేయర్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో తెలంగాణ జట్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. దీని పరిగణలోకి తీసుకున్న నిర్వాహకులు సదరు జట్టుపై చర్యలు చేపట్టి తెలంగాణ జట్టును విజేతగా ప్రకటించింది.

నేడు ఫైనల్స్‌కు చేరిన కర్ణాటక, హర్యానా జట్లు

గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న కబడ్డీ పోటీలు గురువారంతో ముగియనున్నాయి. ఉదయం 11 గంటలకు ఫైనల్‌కు చేరిన కర్ణాటక, హర్యానా జట్లు తలపడనున్నాయి. ఈనెల 7 నుంచి ఉత్కంఠ భరితంగా కబడ్డీ పోటీల నిర్వహణ జరిగింది. నాలుగు రోజుల పాటు రసవత్తరంగా పోటీల్లో పాల్గొని విజయం సాధిస్తూ వచ్చిన తెలంగాణ జట్టు సెమీఫైనల్‌లో తడబడి హర్యానా చేతిలో పరాజయం పాలైంది. విజయం సాధించిన కర్ణాటక, హర్యానా జట్లు తలపడనుండగా ఫైనల్‌లో ఎంపికైన జట్టుకు మ్యాచ్ అనంతరం బహుమతి ప్రదానం చేయనున్నారు. ఈ ఫైనల్ మ్యాచ్‌తో పాటు ముగింపు కార్యక్రమంలో పాల్గొనేందుకు వీక్షకులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎస్‌జీఎఫ్ నిర్వాహకులు కోరారు.

సెలవుల్లో గ్రామాలకు వెళ్లే వారు


దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి టౌన్, జనవరి 10: సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యా సంస్థలకు సెలవులుండడంతో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సింధూశర్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటికి తాళం వేసి ఉన్నది గమనించి దొంగలు దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉందని గతంలో ఈ పండుగల సమయంలోనే కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణ కేంద్రాలలో దొంగతనాలు జరిగాయని తెలిపారు. ఇంటికి తాళం వేయకుండా ఒక వ్యక్తి ఇంట్లో ఉంటే మంచిదని, బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని తెలిపారు. ఊరు వెళ్తున్నప్పుడు విలువైన వస్తువులతో కూడిన బ్యాగ్‌లను మీ చేతుల్లోనే ఉంచుకోవాలని బస్ క్యాబిన్ లేదా సీట్లలో పెట్టి ధ్యాస మరలినట్లయితే దొంగతనం జరిగే అవకాశం ఉందని తెలిపారు. గ్రామాలకు వెళ్లేవారు ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలని తెలిపారు. ఆరుబయట వాహనాలను వదిలివెళ్లకుండా ప్రహరీ లోపల ఉంచడం మంచిదని, ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ అమర్చుకోవడం మంచిదని తెలిపారు. పండుగ సందర్భంగా కోడి పందెలు ఆడడం జిల్లాలో నిషేధం. కోడి పందెలు, జూదం, ఇతర చట్ట వ్యతిరేక కార్యక్రమాలు, ఆటలు ఆడిన వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రాణహాని కల్గించే మాంజా వాడకూడదని తెలిపారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే మంచిదని ఇంటర్నెట్ తో అనుసంధానం చేసుకోవాలని ఎక్కడ ఉన్న తాళం వేసి న ఇంటిని గాని, జరుగుతున్న పనులను గాని ఎలాంటి దిగులు పడకుండా ప్రత్యక్షంగా చూసుకునే వీలు ఉంటుందని తెలిపారు.

ఫీజులుం

- వార్షిక పరీక్షలు సమీపిస్తున్న వేళ ఫీజుల కోసం ఒత్తిళ్లు
- నిబంధనలకు విరుద్ధంగా నాలుగింతల వసూళ్లు
- ఎక్కడా కనిపించని ప్రభుత్వ ఫీజు చార్ట్
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న విద్యాశాఖ
- జిల్లాలో 166 ప్రైవేట్ పాఠశాలలు, 48 వేల మంది విద్యార్థులు



కామారెడ్డి టౌన్, జనవరి 10: ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని నియంత్రించడంలో విద్యాశాఖ పూర్తిగా విఫలమవుతోంది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజులు వసూలు చేయాల్సి ఉన్నా ఎవరికి తోచిన రీతిలో వారు వసూలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పాఠశాలల్లో స్లిప్ టెస్ట్‌లు మొదలుకొని సమ్మెటివ్, ఫార్మెటివ్ వరకు ఏ పరీక్ష నిర్వహించినా యాజమాన్యాలు విద్యార్థులను ఫీజులు కట్టాలంటూ వేధింపులకు గురి చేస్తున్నాయని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. అడిగినంత ఫీజు చెల్లిస్తేనే పరీక్ష రాయిస్తున్నారని పేర్కొంటున్నారు. లేదంటే గంటల తరబడి క్లాస్ బయట నిలబెడుతున్నారు. ప్రిన్సిపాల్‌ను కలవాలని పంపుతున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర మనో వేదనకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించడం లేదు. ఒక వేళ పాఠశాలను తనిఖీ చేసిన విద్యార్థులతో గాని తల్లిదండ్రులతో గాని మాట్లాడిన పాపాన పోవడం లేదు. జిల్లాలో అధికారికంగా 166 ప్రైవేట్ పాఠశాలలు, 48,207 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

ఫీజుల నియంత్రణలో విఫలం

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పోటీ పడి ఫీజుల మోత మోగిస్తున్నాయి. ఇంటర్, డిగ్రీలో ఆయా గ్రూపులకు సంవత్సరానికి రూ.10వేల నుంచి రూ.18వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇక ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి వరకు రూ.30 వేల నుంచి రూ.లక్షకు పైగా వసూలు చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ఎల్‌కేజీకే రూ.25 వేలకుపైగా దండుకుంటున్నారు. పరీక్షలు నిర్వహించే ప్రతీసారి ఫీజుల కోసం విద్యార్థులను పీడిస్తున్నారు. ప్రభుత్వ ఫీజుకు పది రేట్లు అధికంగా వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం వార్షిక పరీక్షలు సమీపిస్తున్న వేళ యాజమాన్యాలు ఫీజుల విషయంలో మరింత కఠినంగా వ్యవహరిస్తున్నాయి.

ఫీజు చార్ట్ ఇలా..

ఆయా పాఠశాలల్లో విద్యార్థుల వంద వసూలు చేయాల్సిన ఫీజు చార్ట్‌ను ప్రకటించిన పాఠశాలల యాజమాన్యాలు ఎక్కడా పట్టించుకున్న పాపాన పోవడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఫీజు చార్ట్ ప్రకారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో అయితే నెలకు రూ.650, సంవత్సరానికి రూ.7,500 వసూలు చేయాలి. పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.750, ఏడాదికి రూ.9వేలు తీసుకోవాలి. ఉన్నత పాఠశాల స్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.900, ఏడాదికి రూ.10,800, పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.1000, ఏడాదికి రూ.12వేలు తీసుకోవాలి. అయితే ఈ ఫీజులను 10 శాతం అధికంగా వసూలు చేస్తున్నారు. ఎవరైన తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే హడావుడి చేసి ఆ తర్వాత పట్టించుకోవడం లేదనేది బహిరంగ రహస్యం.

నిబంధనల ప్రకారం మిల్లింగ్ పూర్తి చేయాలి

కలెక్టర్ జితేష్ వి. పాటిల్



పిట్లం రైసుమిల్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

పిట్లం, జనవరి 10: రైసుమిల్లర్ల యజమానులు నిబంధనల ప్రకారం మిల్లింగ్ చేసి లక్ష్యం పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ రైసుమిల్ యజమానికి ఆదేశించారు. బుధవారం పిట్లం మండలంలోని మద్దెల్‌చెరు గ్రామంలో గల మిలాల్ రైసుమిల్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. రైసుమిల్‌లో నిల్వ ఉన్న ధాన్యం, బియ్యన్ని రికార్డులను పరిశీలించారు. ఈనెల చివరి వరకు రైసుమిల్లర్‌లు లక్ష్యం పూర్తి చేయాలని, నిబంధనలు పాటించని రైసుమిల్లర్లపై చట్టారీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎవరైన అక్రమాలకు పాల్పడితే రైసుమిల్ యజమానులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట ఆర్డీవో భుజం గ్‌రావ్, డిప్యూటీ తహసీల్దార్ నరేష్ ఉన్నారు.

మద్నూర్‌లో ఆన్‌లైన్ నమోదును పరిశీలించిన కలెక్టర్

మద్నూర్ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా పాలన ఆన్‌లైన్ నమోదును కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినకార్యక్రమం 6 గ్యారంటీల కోసం దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని ప్రత్యే కంగా పరిశీలిస్తున్నామన్నారు. త్వరితగతిన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేసి షిప్పుల వారీగా విధులు కేటాయించాలని, వాటికి సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలని తహసీల్దార్ ముజీబ్, ఎంపీడీవో రవీశ్వర్ గౌడ్‌లను ఆదేశించారు. ప్రతీ ఒక్క దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధంగా ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు.

వలస కార్మికుల పిల్లలు బడిలో చేరిక

మాచారెడ్డి, జనవరి 10: ఇటుక బట్టీల్లో పనిచేసే వలస కార్మికుల పిల్లలను బుధవారం విద్యాశాఖ సిబ్బంది బడిలో చేర్పించారు. మండల కేంద్రంలోని అక్కాపూర్ హాబిటేషన్ పరిధిలో ఇటుక బట్టీలో పని చేస్తున్న కార్మికుల ఏడుగురు పిల్లలను బట్టి యజమాని సహకారంతో మాచారెడ్డి ఎక్స్‌రోడ్డు పాఠశాలలో నలుగురిని, జడ్పీహెచ్ఎస్ అక్కాపూర్ పాఠశాలలో ముగ్గురిని చేర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మంజుశ్రీ, రాజేశ్వరీదేవి, సీఆర్‌పీ దేవసంజీవ్, ఇటుక బట్టి యజమాని భగవాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను గ్రామాల వారీగా నిర్వహిస్తాం

● కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

భిక్కనూరు, జనవరి 10: గతంలో మాదిరిగా కాకుండా ఇప్పటి నుంచి ప్రభుత్వ కార్యక్రమాలను గ్రామాల వారీగా నిర్వహించడం జరుగుతుందని, తద్వారా గ్రామాల్లోని ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు అనుకూలంగా ఇబ్బందులు లేకుండా ఉంటుందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కామారెడ్డి నియోజకవర్గాన్ని రాజకీయాలకు అతీతంగా అన్నిపార్టీల నాయకులకు కలుపుకుని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో కేవలం ప్రజాప్రతినిధులు మాత్రమే పాల్గొనాలని, ప్రజా ప్రతినిధులకు ఆ గౌరవం దక్కాలని, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, మిగితా అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. నాయకులకు ఫొటోలతో, ఆడంబరాలతో పేరు రాదని కేవలం ప్రజలకు సేవ చేసినప్పుడు మాత్రమే పేరు, గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ గాల్ రెడ్డి తహసీల్దార్ శివప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ అనూష, ఎంపీటీసీ చంద్రకళ, జంగంపల్లి ఉపసర్పంచ్ భాస్కర్‌చారి, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల అనుమతికి అధిక డబ్బులు తీసుకున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు

పెద్ద కొడప్‌గల్, జనవరి 9: మండల కేంద్రంలో ఇళ్ల నిర్మాణానికి గాను పంచాయతీ సిబ్బంది అధికంగా డబ్బులు తీసుకుని తక్కువ మొత్తానికి రశీదులు ఇచ్చారని లబ్ధిదారులు మంగళవారం జుక్కల్ ఎమ్మెల్యే తోటకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీకి ఎమ్మెల్యే రాగా గృహ నిర్మాణదారులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణదారులు మాట్లాడుతూ తాము డబుల్ బెడ్ రూం ఇంటి నిర్మాణం కోసం పంచాయితీ సిబ్బందికి అనుమతి కోసం వెళ్లే తమ నుంచి 14 వేల రూపాయల నుంచి 25 వేల రూపాయల వరకు తీసుకున్నారని, రశీదు మాత్రం 882 రూపాయలకు రశీదు ఇచ్చారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయంపై విచారణ చేయాలని ఎంపీడీవోకు ఆదేశించారు.

'ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండేది కాంగ్రెస్'

పెద్ద కొడప్‌గల్, జనవరి 9: ప్రజలకు ఇచ్చిన మాటలకు కట్టుబడి ఉండేది కాంగ్రెస్ పార్టీయేనని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్ పేర్కొన్నారు. బుధవారం పెద్ద కొడప్‌గల్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ.. ఎన్నికల హామీలలో భాగంగా కాంగ్రెస్ ప్రజలకు ఆరు గ్యారెంటీ పథకాలను ఇవ్వడం జరిగిందని తెలిపారు. అందులో నుంచి రెండు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తున్నామని, మిగతా నాలుగు పథకాలను 100 రోజుల్లో అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దశరథం, ఎంపీడీవో రాణి, ఎంపీవో సూర్యకాంత్ పాల్గొన్నారు.

బీబీపేటలో సైబర్ క్రైంపై అవగాహన

బీబీపేట, జనవరి 10: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో ఎస్ఐ అనిల్ ఆధ్వర్యంలో ప్రజలకు సైబర్ క్రైంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా ప్రయాణికులు బస్సులో రద్దిసందర్భంగా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. గుర్తుతెలియని వారికి ఫోన్‌లో వచ్చిన ఓటీపీ షేర్ చేయకూడదని తెలిపారు. వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ధ్రువపత్రాలను వెంట బెట్టుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సొంత గూటికి మాజీ ఉప సర్పంచ్

దోమకొండ, జనవరి 10: మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన ముత్తగారి శిరీష్‌గౌడ్ సొంత గూటికి చేరారు. హైదరాబాద్‌లోని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ శిరీష్‌గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

బస్టాండ్ ప్రహరీ నిర్మాణానికి కొలతలు

దోమకొండ, జనవరి 10: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రహరీ నిర్మాణానికి బుధవారం ఆర్టీసీ డీఎం ఇందిరా, సర్వేయర్ రాకేష్ కొలతలు నిర్వహించారు. మ్యాప్ ప్రకారమే తాము ఆర్టీసీ నిధులు రూ.29 లక్షలతో వివిధ రకాల పనులను చేయడం జరుగుతందని డీఎం తెలిపారు. కాగా బస్టాండ్ తూర్పు నుంచి పడమరకు దక్షిణ భాగము యందు ఉన్న కాలనీవారికి దారి లేకుండా అవుతుందని ప్రజలు ఇబ్బందులు పడకుండా దక్షిణం దిక్కున 40 ఫీట్లు దారి వదిలి నిర్మాణం చేయాలని కాలనీ ప్రజలు కోరడంతో సర్పంచ్ నల్లపు అంజలి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 40 ఫీట్లు దారి వదిలి పనులు చేసే విధంగా ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని సర్పంచ్ కలెక్టర్‌కు అందజేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు.

గృహలక్ష్మి పథకం రద్దును వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ నాయకుల ఆందోళన

● గృహలక్ష్మి పథకాన్ని ప్రభుత్వం యధావిధిగా అమలుచేయాలి ● కాంగ్రెస్ అభయహస్తంలో ప్రథమ ప్రాధాన్యాత కల్పించాలని వినతి

ఏర్గట్ల, జనవరి 10: గృహలక్ష్మి పథకం రద్దును వ్యతిరేకిస్తూ బుధవారం మండలంలోని గృహలక్ష్మి పథకం లబ్ధిదారులు బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ మహమ్మద్ యూసుఫ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు కట్టుకోవడానికి రూ.3లక్షలు ఆర్థిక సహాయం అందజేస్తూ ప్రొసీడింగ్ కాపీలను అందజేశారన్నారు. అందుకే మేము ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాలనుకున్న సమయంలో ఎన్నికలు రావడంతో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం మంజూరు చేసిన ప్రొసీడింగ్ కాపీలను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో ఇంటి నిర్మాణం పనులు చేపట్టలేక పోతున్నం దుకు గాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో అర్హులుగా గుర్తిం చిన వారికి రూ.3 లక్షలతో పాటు ఇప్పుడున్న ప్రభుత్వం రూ.5లక్షల అదనపు ఆర్థిక సహాయం అందజేయాలని, సీఎంగారు స్పందించి తమకు న్యాయం చేయాలని వినతి ప్రతంలో పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎనుగందుల రాజాపూర్ణా నందం, ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, కోఆప్షన్ సభ్యుడు ఎండి అశ్రఫ్, ఓర్సు రాములు, అంజయ్య,మోహన్, గృహలక్ష్మి లబ్ధిదారులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ రూరల్: భీమ్‌గల్ పట్టణంలోని సుమంగళి చౌరస్తావద్ద బుధవారం భీమ్‌గల్ మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష్య సాధింపు ధోరణితో నిలిపి వేసిందని ఆపథకాన్ని వెంటనే అమలు చేయాలని మండల బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. ఇట్టి రాస్తారోకో ధర్నాకు ఎటువంటి అనుమతులు లేవని భీమ్‌గల్ ఎస్సై హరిబాబు ధర్నా వద్దకు చేరుకొని బీఆర్ఎస్ నాయకులను చెదరగొట్టారు.



ఏర్గట్లలో నిరసన తెలుపుతున్న గృహలక్ష్మి లబ్ధిదారులు

అనంతరం బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ చౌటపల్లి రవి, ఎంపీపీ ఆర్మూర్ మహేష్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య, మల్లెల లక్ష్మణ్, మండల బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: తెలంగాణ ప్రభుత్వం అమలుపరుస్తూ ప్రొసీడింగ్ పత్రాలను అందజేసిన గృహలక్ష్మి పథకం రద్దును కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేయడాన్ని నిరసిస్తూ బుధవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గృహలక్ష్మి పథకం లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చి నిరసన వ్యక్తంచేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు కట్టుకోవడానికి రూ.3లక్షలు ఆర్థిక సహాయం అందజేస్తూ ప్రొసీడింగ్ కాపీలను అందజేశారని ఎన్నికల కోడ్‌తో నిర్మాణ పనులు చేపట్టలేక పోయామన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం మంజూరీ చేసిన గృహలక్ష్మి పథకం ప్రొసీడింగ్ కాపీల ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో తీవ్రంగా వ్యతి రేకిస్తున్నామన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం పథకంలో మొ దటి ప్రాధాన్యతగా ఇళ్లు మంజూరీ ఇచ్చి తమకు న్యాయం చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇదిలాఉండగా బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో ప్రకారం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేసిందని బీఆర్ఎస్ నాయకులు ప్రొసీడింగ్ పత్రాలలో కనీసం అధికారుల సంతకాలు లేవని కాంగ్రెస్ నాయకులు అక్కడికి వచ్చిన లబ్ధిదారుల ముందే పరస్పర వాదనలకు దిగారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం గృహలక్ష్మి లబ్ధిదారులు ధర్నా చేశారు. గత ప్రభుత్వం గృహలక్ష్మి పథకం వల్ల మూడు లక్షల ప్రొసీడింగ్‌లను ఇచ్చారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేసిందని వారు ఆరోపించారు. దీంతో పేదలమైన మాకు అన్యాయం జరిగిందని అన్నారు. నిరుపేదలమైన మాకు కొత్త ప్రభుత్వం గృహలక్ష్మి పథకం రద్దు చేయడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతామని లబ్ధిదారులు ఆందోళన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమకు మొదటి ప్రాదాన్యత ఇవ్వాలని, మహిళలు డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ శివలింగు శ్రీనివాస్, జడ్పీటీసీ బద్దంరవి, ఏలియా, బద్దం అశోక్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కల్లెడిలో మాట్లాడుతున్న జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

మాక్లూర్,జనవరి10: పేదల కోసం కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు కోరారు. బుధవారం మండలంలోని కల్లెడి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో జడ్పీచైర్మన్ దాదన్న గారి విఠల్‌రావు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్‌భవ, ఉజ్వలగ్యాస్, ప్రధానమంత్రి అవాస్ యోజన, తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో క్రాంతి, సర్పంచ్ లావణ్య, వైస్‌ఎంపీపీ సుక్కి సుజాత, ఏపీఎం అనిల్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సర్పంచులను పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించాలి

నిజామాబాద్ అర్బన్, జనవరి 10: ఈనెలాఖరుకు సర్పంచుల పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో మళ్లీ ఎన్నికలు నిర్వహించేంతవరకు ప్రస్తుత సర్పంచులను ఇన్‌చార్జి సర్పంచులుగా కొనసాగించాలని మాజీ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గోర్త రాజేందర్ కోరారు. హైదరాబాద్‌లో సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రొఫెసర్లు కోదండరాం, హరగోపాల్, మల్లురవి తదితరుల ఆధ్వర్యంలో కేసీఆర్ పాలనలో సర్పంచుల అప్పులు, ఆత్మహత్యలపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాజేందర్ మాట్లాడారు. గత ప్రభుత్వం పంచాయతీకి రావలసిన బిల్లులు రావాలన్న ప్రస్తుత సర్పంచులకు న్యాయం జరగాలన్న వారిని పర్సన్ ఇంచార్జిలుగా నియమించాలని కోరారు. ఈ సందర్భంగా వారికి వినతిపత్రం అందజేశారు.

వాటర్‌ప్లాంట్ యజమానిపై చర్యలు తీసుకోవాలని వినతి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీ చింతల దాస్

ఇందల్వాయి, జనవరి 10: ఇందల్వాయి మండల కేంద్రంలోని రైల్వేగేట్ పక్కనగల వాటర్‌ప్లాంట్ ఎలాంటి అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం స్థానిక ఎంపీటీసీ చింతల దాస్ తహశీల్దార్ వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వాటర్ ప్లాంట్‌ను ఎలాంటి నీటి శుద్ధి చేయకుండా డబ్బుల కోసం ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారని గ్రామ పంచాయతీ నుండి కానీ మండలం నుండి కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే ఈ కేంద్రాన్ని నడుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఈ ప్లాంట్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఇందల్వాయి, జనవరి 10: కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సత్యనారాయణ అన్నారు. బుధవారం ఇందల్వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. పేద ప్రజలకు మౌలిక సదుపాయాలైన గ్యాస్ కనెక్షన్, పక్కాఇళ్లు, ఆహారభద్రత, వైద్యం, నాణ్యమైన విద్య తదితర కార్యక్రమాలను అమలు చేస్తోందని వీటిని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్న పలువురితో మాట్లాడించారు. ఇఫ్కో వారు వ్యవసాయానికి అవసరమైన డ్రోన్స్ స్ప్రేయర్ ద్వారా మందుల పిచికారిని ప్రజలకు వివరించారు. వీటి ద్వారా ఎకరానికి రూ.500ల ఖర్చుతో పిచికారి చేయవచ్చని సూచించారు. వ్యవసాయ దారులు ఇలాంటి పరికరాలను ఉపయోగించుకొని లబ్ధిపొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందల్వాయి మండల అధికారులు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

టీయూలో చదరంగం క్రీడా పోటీలు

డిచ్‌పల్లి,జనవరి 10: తెలంగాణ యూనివర్సిటీ అంతరకళాశాలల చదరంగం పోటీలను బుధవారం వర్సిటీ క్రీడా విభాగం డైరెక్టర్ బాలకిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకిషన్ మాట్లాడుతూ.. చదరంగం పోటీలలో ప్రతిభ కనబర్చిన క్రీడకారులను సౌత్ జోన్ అంతర్ వర్సిటీ క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ చెస్ ఛాంపియన్ పోటీలు 2024ను తమిళనాడులోని భారతీదాసన్ వర్సిటీలో ఈ నెల 24నుంచి 29వరకు నిర్వహిస్తున్నారని తెలంగాణ యూనివర్సిటీ నుంచి చెస్ క్రీడకారులు సందీప్, రాకేశ్, హన్మన్ గుప్త, సాయికుమార్, శివాసాయి, ఈ క్రీడలకు వెళ్తునట్లు తెలిపారు. వారి వెంట క్రీడా విభాగం సహాయాచార్యులు డా.బీఆర్ నేతా, వారికి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని బాలకిషన్ పేర్కొన్నారు.

క్రీడలతో మానసికొల్లాసం

బోధన్ రూరల్, జనవరి 10: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగప డుతాయని సాలూర సొసైటీ ఛైర్మన్ అల్లె జనార్ధన్ అన్నారు. సాలూర మండల కేంద్రంలో సీజన్ - 3 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శరీరదారుఢ్యానికి ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ప్రతీ సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రికెట్ పోటీలకు వివిధ గ్రామాల నుంచే కాక వివిధ మండలాల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రధా నం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శైలేందర్, సర్పంచ్ చంద్రకళ, ఉప సర్పంచ్ డిస్కో సాయిలు, గ్రామ పెద్దలు అల్లె రమేష్‌లతో పాటు గ్రామస్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ డొల్లతనం బయటపడుతుందనే భయంతో ధర్నా

● జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, జనవరి 10: డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో పదేళ్ల పాటు ప్రజలను, పేదలను బీఆర్ఎస్ పార్టీ మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామన్న హామీ ప్రకారం ప్రజాపాలనలో దరఖాస్తులు తీసుకోవడం జరిగిందని ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు ఇచ్చిన డబుల్ బెడ్ రూం అప్లికేషన్లు రద్దు చేశారని బీఆర్ఎస్ పార్టీ ధర్నాకు పిలుపునివ్వడం సిగ్గుచేటని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లకు కేవలం రూ.3లక్షలు ఇచ్చిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిందని ఎక్కడ బీఆర్ఎస్ బాగోతం బయటపడుతోందని ఇప్పుడు ధర్నాల పేరుతో కొత్త డ్రామాలు ఆడుతున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో అనేక మందికి అనర్హులైన డబుల్ బెడ్‌రూం ఇళ్లు, పెన్షన్లు, సబ్సిడీ ట్రాక్టర్లు, కల్యాణలక్ష్మిలు ఇచ్చారని ఇప్పుడు కాంగ్రెస్ అర్హులకు ఇస్తామంటే బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందన్నారు. బాల్కొండ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఐదేళ్లుగా గృహ నిర్మాణశాఖ మంత్రిగా ఉండి ఒక్క ఇళ్లు అయిన జిల్లాలో ఇచ్చారా అని ప్రశ్నించారు. ప్రజలు బీఆర్ఎస్ కల్లబొల్లి మాటలను నమ్మొద్దని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ అర్హులందరికి న్యాయం చేస్తోందన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల సమ్మె విజయవంతం

నిజామాబాద్ అర్బన్, జనవరి 10: భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఎల్ఐసీ కార్యాలయం ఎదుట గంట సేపు సమ్మె నిర్వహించారు. నగరంలోని ఎల్లమ్మగుట్టలో గల ఎల్ఐసీ కార్యాలయం ఎదుట జేఏసీ నాయకులు సక్కిసత్యనారాయణ, గంగోనె శ్రీధర్, చంద్రశేఖర్ తదితరులు మాట్లాడుతూ తక్షణమే ఉద్యోగులకు వేతన సవరణ చేయాలని యాజమాన్యం కాలయాపన చేసే విధానాన్ని ఎండగట్టేందుకు ఈ సమ్మె చేస్తున్నామన్నారు. న్యూ పెన్షన్స్ స్కీమ్‌లో యాజమాన్యం వాటా 14 శాతానికి పెంచాలని, పాత పెన్షన్ విధానం వల్ల ఉద్యోగులందరికి న్యాయం జరుగుతుందన్నారు. యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు ఉద్యోగులంతా ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎల్ఐసీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సక్కి ఆనంద్, శివశంకర్, సామ్రాట్, సతీష్, గంగాధర్, కల్పన, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పందిమడుగులో అక్షింతల పంపిణీ

సిరికొండ జనవరి 10:సిరికొండ మండలం పందిమడుగు గ్రామంలో అయ్యోధ్య రాములవారి పల్లకీని అలంకరించి అక్షింతలను పెట్టి ప్రభాత్ భేరీ నిర్వహించారు. గ్రామంలో ప్రధాన వీధుల్లో జై శ్రీరాం అంటు నినాదాలు చేస్తూ భజన పాటలు పాడుతూ పల్లకీలో శోభాయాత్ర నిర్వహించి ఇంటింటికి తిరుగూ అక్షింతలను పంపిణి చేశారు.

నవీపేట: అయోధ్య శ్రీరామ క్షేత్ర ట్రస్ట్ అందించిన పవిత్ర అక్షింతలను బుధవారం మండలంలోని కోస్లీలో ఇంటింటికీ పంపిణీ చేశారు. స్థానిక హనుమాన్ మందిరంలో అక్షింతలకు పూజలు నిర్వహించి గడప గడపకు తిరిగి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు ఆరె గంగాధర్, వైస్ ఎంపీపీ హరీష్ కుమార్, సందీప్, రవి, శ్రీనివాస్, యోగేష్, సతీష్, తదితరులున్నారు.

రెగ్యులరైజ్ కోసం మంత్రి సీతక్కకు వినతి

డిచ్‌పల్లి, జనవరి 10: తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ లను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డా.దత్తహరి బుధవారం మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజ్ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని మంత్రిని కలిసి ఔట్ సోర్సింగ్ ప్రతినిధులు కోరారు.మంత్రిని కలిసినవారిలో దత్తహరి, బికోజీ, సురేశ్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు శ్రీశైలం, రాజేశ్వర్, పాల్గొన్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

రెంజల్,జనవరి10: రెంజల్ మండలంలోని కూనేపల్లి గ్రామానికి చెందిన సుద్ద సతీష్(25)అనే వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారని రెంజల్ ఇన్‌చార్జి ఎస్ఐ విక్రమ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..కూనేపల్లి గ్రామానికి చెందిన సతీష్ మంగళవారం రోజున తనపాప యొక్క బారసాల కార్యక్రమం జరుపగా మద్యం తాగి ఇంట్లోకి రాగా బంధువులు మద్యం ఎందుకు తాగావని అడుగగా భార్యతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వచ్చి తన బంధువైన అన్నం నాగరాజు అనే వ్యక్తితో కలిసి గ్రామ శివారులోని భీంగుంట చెరువు వైపు వెళ్లగా సాయంత్రం 4గంటల సమయంలో సతీష్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. తన బంధువైన నాగనాజు చూసి వెంటనే కుటుంబ సభ్యులకు తెలుపగా కుటుంబ సభ్యులు చెరువు దగ్గరికి వెళ్లిచూడగా నీటిలోమునిగిపోయి ఉన్నాడు.బుధవారం రోజునఉదయం జాలర్లతోచెరువులో వెతికించగా సతీష్‌శవం లభించిందని తెలిపారు. భార్యసునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

బోధన్‌రూరల్, జనవరి 10: కోటగిరి మండలం సుంకిని గ్రామానికి చెందిన గంగారం అనే వ్యక్తి అదృశ్యం పట్ల బోధన్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి నట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గంగారంను హైదరాబాద్‌కు చెందిన నవనాథ్ అనే వ్యక్తి పనుల నిమిత్తం పది రోజుల క్రితం హైదరాబాద్ తీసుకెళ్లాడని, తిరిగి ఈనెల 1వ తేదీన బోధన్ బస్టాండ్‌లో వదిలి వెళ్లినట్లు పేర్కొన్నారు. అప్పటి నుంచి గంగారాం తన స్వగ్రామానికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు విచారించగా ఆచూకి లభించకపోవడంతో బుధవారం బోధన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గంగారాం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, గంగారాం అదృశ్యంపై అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

తడపాకల్‌లో ఇసుక ట్రాక్టర్ సీజ్

ఏర్గట్ల, జనవరి 10: మండలంలోని తడపాకల్ గ్రామంలో బుధవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న టాక్ట్రర్‌ను సీజ్ చేసినట్లు స్థానిక ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు.మండల అధికారుల అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రజిని కిషోర్

రెంజల్,జనవరి10: రెంజల్ మండల సర్వసభ్య సమావేశం బుధవారం మండ పరిషత్ అధ్యక్షురాలు రజిని కిషోర్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రధాన శాఖలకు సంబంధించిన విషయాలపై చర్చించి మిగత శాఖలను కొనసాగించకుండానే మండల సర్వసభ్య సమావేశం ముగించారు. రెంజల్ నుంచి దండిగుట్ట మాటు కాలువ నిర్మాణ పనుల్లో అధికారుల జాప్యం జరుగుతుందని పలుమార్లు దృష్టికి తీసుకువచ్చిన ఫలితం లేకుండాపోయిందని కోఆప్షన్ సభ్యుడు అంతయ్య సభ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులు, టీచరు పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల రాణి తెలిపారు. రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులోనే ఉన్నాయని కావాల్సిన రైతులు సొసైటీల వద్ద కొనుగోలు చేసుకోవాలని వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మేక విజయ సంతోష్, ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ రాంచందర్, వైస్ ఎంపీపీ యోగేష్, సూపరిండెంట్ శ్రీనివాస్, ఎంపీవో గౌస్, సర్పంచ్‌లసంఘం మండల అధ్యక్షుడు రమేష్ కుమార్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు



సినీనటి అనన్యతో సెల్ఫీ దిగుతున్న యువతులు, మహిళలు



ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గు వద్ద మహిళలు

ముగ్గుల హరివిల్లు

ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్



ముగ్గు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని



ముగ్గు వేస్తున్న కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి



ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్స్‌లో పోటీదారులు వేసిన ముగ్గులతో ఇంద్రధనస్సు నేలకు దిగి వచ్చిందా అనిపించింది. తెలంగాణవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పోటీలు జరగగా, ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు ఫైనల్స్‌లో తమ ముగ్గులతో పోటీ పడ్డారు. సినీనటి అనన్య నాగళ్ల, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినితో పాటు కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి



సినీనటి అనన్య



ముగ్గులు వేస్తున్న మహిళలు





అతిథులకు స్వాగతం పలుకుతున్న ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, స్టేట్ బ్యూరో చీఫ్ ఉప్పులూరి మురళీకృష్ణ

వ్యక్తి అదృశ్యం



తృప్తి వెంకటేష్

కామారెడ్డి టౌన్, జనవరి 10: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లికి చెందిన తృప్తి వెంకటేష్ కనిపించకుండా పోయినట్లు దేవునిపల్లి ఎస్ఐ రాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 10న పని నిమిత్తం బయటకు వెళ్లి రాత్రి వరకు తిరిగిరాలేదన్నారు. కుటుంబీకులు చుట్టు పక్కల వెతికినా ఎలాంటి సమాచారం లేకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. వెంకటేష్ ఎక్కడైన కనిపిస్తే సీఐ 8712686148, ఎస్ఐ 8712686150 నంబర్లకు తెలియజేయాలని సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్

కామారెడ్డి టౌన్, జనవరి 10: ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 10 సంవత్సరాల పాటు బీఆర్ఎస్ పార్టీ అరాచక పాలన చేసి ప్రజలను ఇబ్బంది పెట్టిందని ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు 6 గ్యారెంటీ పథకాలతో పాటు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని 100 రోజుల్లో ఆ పథకాలు అమలు చేయకపోతే సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు రమ, జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్, జిల్లా కోర్ కమిటీ సభ్యులు మోతీరాంనాయక్, సురేష్‌గొండ, చంద్రశేఖర్, నర్సింలు, ఎల్లయ్య, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేటకు 15వ ఆర్థిక సంఘం నిధుల మంజూరు

లింగంపేట: మండలంలోని 14 ఎంపీటీసీ స్థానాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు మొత్తం రూ.30లక్షలు మంజూరయ్యాయని ఎంపీపీ గరీబున్నీసా తెలిపారు. ఈ నిధులతో అభివృద్ధి పనులు పనులు ప్రారంభమవుతాయని ఆమె తెలిపారు.

ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలన

బీర్కూర్, జనవరి 10: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభయహస్తం ప్రజాపాలన కార్యక్రమం చేపట్టిందని ఎంపీడీవో భానుప్రకాష్ అన్నారు. ఇందులో భాగంగా బీర్కూర్ మండలంలో 12 గ్రామ పంచాయతీల పరిధిలో 7వేల 579 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో భాను ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నామన్నారు. బుధవారం నాటికి 5,200ల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరిచామన్నారు. ఈ నెల 17లోపు మొత్తం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియను ఎంపీడీవో భాను ప్రకాష్ బుధవారం పరిశీలించారు.

దోమకొండ: మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ ఎంట్రీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో చిన్నారెడ్డి బుధవారం తెలిపారు. మండలంలో మొత్తం 9,443 దరఖాస్తులు వచ్చాయని అందులో అంబార్‌పేట 1,145, అంచనూర్ 676, చింతమాన్‌పల్లి 428, దోమకొండ 4140, గొట్టిముక్కుల 369, లింగుపల్లి 318, ముత్యంపేట 1,070, సంగమేశ్వర్ 915, శేరిబీబీపేట 196, సీతారాంపల్లి 186 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. మొత్తం దరఖాస్తులు ఎంట్రీ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఆపరేటర్లు వెంకటేష్, సుధాకర్, ప్రశాంత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామిలలో ఇచ్చిన 6 గ్యారెంటీ పథకాలు అమలు కోసం అధికారులు మండలంలోని ఆయా గ్రామాలలో ప్రజా పాలన సభలు నిర్వహించారు. వారం రోజుల పాటు మండలంలోని ఆయా గ్రామాలలో అధికారులు దరఖాస్తులు తీసుకున్నారు. అధికారులు తీసుకున్న దరఖాస్తులను మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపిడివో రాణి మాట్లాడుతు ప్రజా పాలన సభలలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల ద్వారా తమకు 7480 దరఖాస్తులు వచ్చాయని వాటన్నింటిని తమ సిబ్బందితో దరఖాస్తు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నా మని ఎంపిడివో రాణి తెలిపారు.



బీర్కూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో భాను ప్రకాష్

ప్రజలకు అందుబాటులోనే గ్రామస్థాయి కార్యక్రమాలు

దోమకొండ, జనవరి 10: రాబోవు రోజుల్లో ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా గ్రామ స్థాయిలోనే లబ్ధిదారులకు అందే విధంగా పంపిణీ కార్యక్రమాలు చేపట్టాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 30 చెక్కులు ప్రభుత్వం నుంచి వచ్చాయని తెలిపారు. దోమకొండ 12, గొట్టిముక్కుల 1, లింగుపల్లి 1, సంగమేశ్వర్ 5, ముత్యంపేట 3, అంబార్‌పేట 3, అంచనూర్ 1, చింతమాన్‌పల్లి 2, సీతారాంపల్లి 2 చొప్పున పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా ఎలాంటి పనులు ఉన్నా తనను నేరుగా లేదా ఫోన్‌లో సంప్రదించ్చవచ్చన్నారు. ఎలాంటి కార్యక్రమంలో అయిన ప్రొటోకాల్ ప్రకారమే నిబంధనల మేరకే పాల్గొని కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. స్వార్థం లేకుండా ప్రజలకు మేలు జరిగే పనులు ఏ పార్టీలో ఉన్నా వ్యక్తులైనా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కానుగంటి శారద తదితరులు పాల్గొన్నారు.



దోమకొండలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

నేలపైనే పడుకున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట

● క్యాంపు కార్యాలయంలో వసతులు లేకపోవడమే కారణం

పెద్ద కొడప్‌గల్, జనవరి 10 : వసతులు దేవుడెరుగు.. కనీసం బెడ్ కూడా లేకపోవడంతో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావ్ మంగళవారం రాత్రి తన క్యాంపు కార్యాలయంలో నేలపైనే నిద్రించారు. గతంలో జుక్కల్ ఎమ్మెల్యేగా ఉన్న షిండే ఈ క్యాంపు కార్యాలయాన్ని అరుదుగా వాడేవారు. అయితే ఇటీవలే కొత్తగా గెలిచిన లక్ష్మీకాంత్‌రావ్‌కు నియోజకవర్గంలో ఎక్కడా ఇల్లు లేదు. దీంతో క్యాంపు కార్యాలయాన్ని బాగు చేయించారు. అయితే ఈ కార్యాలయానికి అవరమైన ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని జిల్లా అధికారులకు ఎమ్మెల్యే విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఎమ్మెల్యే రాత్రి కార్యాలయంలో నేలపై పడుకున్నారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నేలపై పడుకున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు

చెరుకు టాక్టర్ కిందపడి బాలుడి మృతి

పిట్లం, జనవరి 10: మండలంలోని బాన్సువాడ-పిట్లం రహదారిపై బుధవారం కుర్తి గ్రామం నుంచి చెరుకు లోడ్‌తో చెరుకు ఫ్యాక్టరీకి వెళ్తుండగా ప్రమాదవశత్తు టాక్టర్ కింద పడి ఆదిత్య(13) మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాలుడిని అంబులెన్స్‌లో బాన్సువాడ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు చేసి మృతి చెందినట్లు తెలిపారని పోలీసులు తెలిపారు.

బాన్సువాడ పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలి

● మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి

బీర్కూర్, జనవరి 10 : బాన్సువాడ నియోజకవర్గం పాడి పంటలతో సమృద్ధిగా ఉండాలని, ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం ఆయన బీర్కూర్ మండలంలో పర్యటించారు. బీర్కూర్ వేంకటేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహ కార్యక్రమంలో పాల్గొన్నారు. తుకారం మహరాజ్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వార్కారీలతో కలిసి కీర్తనలు పాడుతూ భజనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని, ఆలయాలు భావితరాలకు సంస్కృతి, సంప్రదాయాలకు ఆలవాలంగా నిలుస్తాయన్నారు.

అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు

● ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు

మద్నూర్, జనవరి 10: నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందజేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు అన్నారు. మద్నూర్, డోంగ్లీ మండలాల్లో 72 మందికి కల్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలలో భాగంగా ప్రభుత్వ పథకాలను అమలు చేయడానికి దరఖాస్తులు తీసుకున్నామని, వాటిని పరిశీలించి, అర్హులైన వారందరికీ సంబంధిత పథకాలను అందజేయడం జరుగుతుందని గుర్తు చేశారు. రాష్ట్రంలో పేదల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, పేదలందరికీ న్యాయం చేయడానికి కంకణం కట్టుకున్నామన్నారు. జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడి ఉందని, తమ హయాంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేసి, జిల్లాలో నెంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంగమేశ్వర్, కాంగ్రెస్ నాయకులు సాయిలు, రమేష్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, తహసీల్దార్ ముజీబ్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గంగాధర్ తదితరులున్నారు.



మద్నూర్‌లో చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
ప్రియా 35	- సలార్
దర్శన్	- ది బ్రిటీష్ సీక్రెట్ ఎజెంట్
శాంతి	- ఎనిమల్
ప్రియా 70	- హాయ్ నాన్న

బాన్సువాడ	
మహేశ్వరి	- సలార్

చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210